కథా కౌముది



# పున్నాగ పూలచెట్టు

డా.జడా సుబ్బారావు



పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
కౌముది నిర్వహించిన కథల పోటీ (2023)లో
సాధారణ ప్రచురణ కథ

నిన్ను మొదటిసారి చూసిందే అక్కడే.

చెట్టు చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ గాలికి రాలిన పున్నాగపూలను ఏరుకుంటున్న నిన్ను చూసేకొద్దీ చూడాలనిపించి అక్కడే ఆగిపోయాను. రాలిన పూలు కింద పడుతున్నాయి. కానీ నా మనసు మాత్రం దూదిపింజలా పైకెగుతోంది. ఆగిన కుళాయిలో నుంచి ఆఖరు బొట్టు రాలినట్లుగా ఒకసారి, విప్పిన కుళాయిలోనుంచి వేగంగా దూకే నీటి ధారల్లా మరికొన్ని సార్లు పున్నాగపూలు నీ మీద రాలుతున్నాయి.

ముఖానికి అతుక్కున్న తుమ్మెదల్లా కనిపించే కళ్ళు, పెన్సిల్'తో గీసిన వక్రరేఖలాగా ఉన్న కనుబొమలు, ఆ రెండు కనుబొమల మధ్య ఉదయిస్తున్న సూర్యుడిలా కనిపించే నుదుటి కుంకుమబొట్టు, గాలితో దోబూచులాడుతూ కనువిందు చేస్తున్న ముంగురులు, వంపులు తిరిగి ప్రవహిస్తున్న మూడు పిల్ల కాల్వలను కలిపి ముడేసినట్లుగా నీ వీపు పైన తాచుపాములా కదలాడుతున్న జడ... నా నోటికి మాట రాకుండా, నా చూపును పక్కకు తిప్పుకోనీయకుండా నీ ఒడిలో రాలుతున్న పువ్వుల్లా మారిపోయాయి.

అలా చూడడం మర్యాదో కాదో నాకు తెలియదు. కానీ చూపు పక్కకి తిప్పితే మళ్లీ ఆ దృశ్యాన్ని చూసే అవకాశం కోల్పోతానని మాత్రం నాకు తెలుసు. మా పల్లెను దాటుకుని చేల గట్ల మధ్యగా నడుచుకుంటూ మీ వీధిలోకి వచ్చే దారిలో ఉన్న పున్నాగపూల చెట్టు దగ్గరికి నువ్వు రోజూ వస్తావో లేదో తెలియదు.

కానీ నాకు మాత్రం అక్కడికి రావడం వ్యసనమయిపోయింది. నిన్ను చూడకపోతే ఉండలేకపోవడం, నువ్వు కనబడకపోతే నన్నల్లుకునే ఒంటరితనం, ఎండాకాలపు ఉక్కపోతలా ఉక్కిరిబిక్కిరయ్యే దేహం, నువ్వు అక్కడికి వస్తావన్న నమ్మకం, నిన్ను చూస్తానన్న ఆశ నన్ను మంత్రించి ప్రతీరోజూ పున్నాగ పూలచెట్టు దగ్గరకు లాక్కొచ్చేవి.

నువ్వంటే ఏదో తెలియని ఇష్టం కలిగింది. నిన్ను చూసే మధురక్షణాలు మళ్లీ మళ్ళీ వస్తే బాగుండనిపించింది. నిన్ను ఎదురుగానో, దొంగచాటుగానో చూస్తూ ఉండిపోవాలనిపించింది. గుప్పెడు పున్నాగపూలను నీ జడనిండా తురమాలనిపించింది. అంతలోనే భయం వేసి ఊరుకున్నాను. స్నానం చేయాలంటే పై నుంచి ఉరికే జలపాతం కింద నుంచోకూడదనిపించి ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నాను.

2

ఇంటికి వచ్చాను. కళ్లనిండా ఏవో వలపు ముసుర్లు ముసురుకున్నాయి. తుపాను రావడానికి ముందు వాతావరణం మారినట్లుగా నా దేహం నిండా నాకే తెలియని కొత్త గాలులు వీస్తున్నాయి. రోజూ కనిపించే పూలమీద కొత్త తుమ్మెదలేవో వాలినట్లు, రోజూ నడిచే దారినిండా ఎవరో పనిగట్టుకుని పున్నాగపూలను పరిచినట్లు ఏదో భ్రమ! మళ్లీ ఆ పిల్లకాల్వ గట్టున కూర్చుని నీ రాకకోసం ఎదురుచూడాలని మనసు ఉవ్విళ్లూరుతోంది.

నీళ్ల తొట్టెవైపు నడిచి చెంబుతో నీళ్ళు తీసుకుని తలమీద పోసుకున్నాను. రెండో చెంబు నీళ్ళు పోసుకోవాలని అనుకుంటుండగా "అన్నం తినడానికి కాళ్లు కడుక్కురమ్మంటే తలమీద నీళ్ళు పోసుకుంటావేరా.. పిచ్చిగానీ పట్టిందా?" అనే అమ్మ మాటలు వినిపించి వెనక్కి తిరిగి చూశాను.

వసారా దండేనికి వేలాడుతున్న పాతబట్టలా, కడిగి అరుగుమీద ఆరబెట్టిన సొట్టపడిన పాత్రలా, పగుళ్లతో కూడిన స్టీలు పళ్లెంలా, పొయ్యి ఆరినాక కనిపించే బూడిదకుప్పలా, చిరుగుల తోరణంలా ఉన్న ఇంటికి నమ్మకమైన కాపలా దారులా కనిపించింది అమ్మ.

నన్ను ఎప్పటినుంచి గమనిస్తుందో తెలియదు. నా వంక అయోమయంగానూ, విచిత్రంగా చూస్తూ నిలబడి ఉంది. అమ్మ నన్ను గమనిస్తుందన్న విషయం తెలియగానే నాలో ఎక్కడలేని సిగ్గు కలిగింది.

ఏమీ మాట్లాడకుండా గుడిసెలోకి నడిచాను.

అమ్మ అన్నట్లు.. నాకు పిచ్చి పట్టిందా?

ఏమో.. పగలూ రాత్రులు ఎక్కడికో పరిగెడుతున్నట్లు అనిపిస్తోంది. ఆకాశం భూమీ తలకిందులైనట్లు కనిపిస్తోంది. చెట్లకొమ్మలు భూమిలోకి పాతుకుపోయినట్లు, వేర్లన్నీ ఆకాశం వైపు తిరగబడినట్లుగా అనిపిస్తోంది. అందరికీ సాధారణంగా కనిపించేవి నాకు మాత్రం కొత్తగా, వింతగా కనిపించడం పిచ్చిగాక మరేమవుతుంది?

3

అనుకోకుండా ఆ మధ్యాహ్నం నిన్ను మరోసారి చూశాను.

ఊరి చివర చేలమధ్యలో ఉన్న 'గోపాల్ పిక్చర్ ప్యాలెస్'లో నిన్ను చూడగానే మనసు నిండా తుపాను గాలులేవో చెలరేగాయి. సముద్రపు ఒడ్డునున్న ఇసుక ఎండకు బాగా వేడెక్కి కాళ్లు కాలినట్లుగా నా శరీరమంతా ఆవిర్లు కక్కుతోంది. నీ స్నేహితురాళ్లతో ఉన్న నీవు నా ముందు నుంచున్న పున్నాగపూల చెట్టులాగా అనిపించావు.

అసలే వేసవి కాలం. ఒంట్లో నుంచి బయటికి చిమ్ముతున్న వేడిని భరించలేక ఏసీ గాలిని పీల్చుకుందామని ఇక్కడికొచ్చిన నాకు హిమాలయ పర్వతాలు కట్టకట్టుకుని ఎదురుగా నిలబడినట్లు అనిపించింది.

నాకు ముందు మూడు వరసల అవతల నువ్వు కూర్చున్నావు. వెండి తెరమీద బొమ్మలేవో కదులుతున్నాయి. చల్లగాలి ఒంటికి తగులుతున్నా ఏదో తెలియని ఉక్కపోత బయటకు వస్తోంది. చీకట్లో మసక మసకగా కనిపిస్తున్న నీ మీదుగా నా చూపును తెరవైపు నిలిపాను.

తెరమీద హీరో సంభాషణలకు హాలులో చప్పట్లు మారుమోగుతున్నాయి.

ప్రేమ చాలా గొప్పదని, కులం, మతం, ప్రాంత, భాష, ఆస్తి, అంతస్తులేవీ ప్రేమకు అడ్డుగోడలు కట్టలేవనీ, ప్రేమ ఎక్కడైనా, ఎప్పుడైనా, ఎవరి మీదైనా పుడుతుందనీ, హీరో పేదవాడైనా అతను తల్చుకుంటే గొప్పంటి అమ్మాయినైనా వాళ్ల తల్లిదండ్రుల్ని ఎదిరించి పెళ్ళి చేసుకోగలడనీ, అవసరమైతే అమ్మాయిని లేవదీసికెళ్ళి పెళ్ళి చేసుకుని చాలా ధైర్యంగా బతగ్గలడనీ, పెద్దల్ని ఎదిరించడం, రౌడీల్ని బెదిరించడం హీరోకి పుట్టుకతోనే వెన్నతో పెట్టిన విద్య అనీ చాలా గొప్పగా చూపిస్తున్నారు. వేసుకోవడానికి బట్టలు కరువైనట్లుగా చాలీచాలని బట్టలతో హీరోయిన్ వేస్తున్న డాన్సులు చూసి హాల్లోని కుర్రకారంతా పైకి లేచిమరీ బల్లలు చరుస్తూ ఊగిపోతున్నారు.

నా చూపును తెర నుంచి తప్పించి మసక చీకట్లో నీ మీదికి మళ్ళించాను. తెరనుంచి వచ్చే వెలుతురును తట్టుకుంటూ చీకట్లో నీ కోసం వెతుకులాడడం చాలా కష్టంగా అనిపించింది. అయినా కష్టంలోనూ ఏదో చెప్పలేని ఇష్టం దాగుంటుందని నాకు అప్పుడే తెలిసింది.

సినిమా శుభం కార్డుతో పాటు నా చూపుల వెతుకులాటకు కూడా తెరపడింది. ఒకర్నొకరు తోసుకుంటూ వెళ్తున్న వాళ్లతో గేటు దగ్గర సందడి మొదలయింది. ముందున్న వాళ్లను దాటుకుంటూ, నువ్వెక్కడ మాయమవుతావనే ఆరాటంతో నా నడక కూడా సాగింది.

పొద్దు గుంకడానికి ఇంకొంచెం సమయమే ఉన్నట్లుంది. పశువుల మందతో రోడ్డంతా హడావిడిగా ఉంది. మీ ఇంటివైపుగా సాగిపోతున్న నిన్ను చూస్తూ నా మనసును ఊరడించుకోలేక నేను కూడా మా ఇంటివైపు నడక సాగిస్తూ

వెనక్కి తిరిగి నీ వైపు చూశాను. అప్పటివరకూ నన్ను చూస్తూ వీధి గుమ్మం దగ్గర నుంచున్నావేమో నాకు తెలియదు. కానీ నేను చూస్తున్నానని తెలియగానే గిరుక్కున ఇంట్లోకి పారిపోయావు.

పున్నాగ పూలను ఏరుకుంటున్న నిన్ను దొంగచాటుగా చూడడం, సినిమా అయ్యాక నిన్ను మీ వీధి వరకు అనుసరించడం నువ్వు గమనించావు. కానీ నన్ను చూడనట్లు, ఏమీ ఎరగనట్లే ఉండిపోయావు. కొన్నాళ్ళు చూపులతోనూ, మరికొన్నాళ్లు పున్నాగ చెట్టుకింద కలిసినప్పుడు పొడి పొడి మాటలతోనూ మన పరిచయం పెరిగింది. ఒకర్నొకరం చూసుకోకుండా, ఒకరితో ఒకరం మాట్లాడకుండా ఉండలేని స్థితికి చేరుకున్నాం.

ఎందుకో మరి.. నిన్ను చూడగానే నా మనసులో అలజడి రేగడం మంచికో చెడుకో నాకు తెలియదు. నీతో మాట్లాడాలని ఆశ కలగడం పుట్టుకో చావో నాకు తెలియదు. నీకు సన్నిహితంగా మెలగాలనుకోవడం పాపమో శాపమో కూడా నాకు తెలియదు. కానీ నీతో జీవితాన్ని పంచుకోవాలనే బలమైన కోరిక మాత్రం నాలో స్థిరపడిపోయింది.

4

ఆ రాత్రి హఠాత్తుగా మెలకువ వచ్చింది. దూరంగా ఎక్కడి నుంచో వినిపిస్తున్న కుక్కల అరుపులు తప్ప దారులన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి. వీధి లైట్లు తప్ప వాకిళ్లన్నీ చీకటితో స్నానం చేస్తున్నాయి.

మంచం దిగి వీధిలో నుంచి వెనక వైపున్న పొలాల వైపు నడిచాను. పిల్లకాలవ దాటి పున్నాగ పూలచెట్టు దగ్గరకు చేరుకున్నాను. అక్కడ నుంచి మీ ఇంటివైపు చూశాను. వెన్నులో భయం, కాళ్లల్లో వణుకు ఒకేసారి కలిగాయి. మీ ఇంటిమీద వెలుగుతున్న లైటును చూడగానే మేడమీద నుంచున్న ఒంటి కన్ను రాక్షసుడెవడో దూరం నుంచి నన్నే చూస్తున్నట్లుగా అనిపించింది.

గట్లు, పుట్టలు దాటుకుంటూ ఎలాగో తంటాలుపడి మీ ఇంటి ముందు నుంచున్నాను. ప్రహరీ గుమ్మం ముందు నాకు నేనే మరుగుజ్జులా అనిపించాను. ఎవర్ని పిలవాలో, గుమ్మాన్నెలా తట్టాలో అర్థం కాలేదు.

అయోమయంగా గోడవారగా తిరుగుతూ నువ్వొక్కసారి కనిపిస్తే చూసి వెళ్లిపోదాం అనుకున్నాను. అంత అర్ధరాత్రి నువ్వు నాకోసం బయటెలా ఉంటావనే ఆలోచన కూడా నాకు రాలేదు. నా ఆలోచనల్లో నేనుండగానే “ఎవ్రా అక్కడ” అన్న పిలుపుతో అదిరిపడి మీ మేడ వైపు చూశాను.

నేనెవరో అర్థం కాక, ఎవరైనా దొంగ వచ్చాడేమోనని నా వైపే చూస్తూ అరుస్తూ కిందకి రాసాగాడు మీ నాన్న. నా కాళ్లు నడక మర్చిపోయాయి. బిత్తరచూపులు చూస్తూ ఏదో జరగబోతోందని అనిపించగానే నాలో భయం ప్రవేశించి అక్కడ నుంచి వేగంగా కదిలాను. కానీ అప్పటికే జరగవలసిన ఆలస్యం జరిగిపోయింది. మీ నాన్న విసిరిన కర్ర నా కాళ్లకు బలంగా తగిలి ముందుకు పడిపోయాను.

“నువ్వా? ఈ టైంలో ఇక్కడేం చేస్తున్నావ్?” నన్ను చూసి ఆశ్చర్యపోతూ అడిగాడు మీ నాన్న.

నేనేమీ మాట్లాడలేదు.

“అడిగేది నిన్నే.. దొంగతనానికి వచ్చావా?” గద్దించాడు.

బయట జరుగుతున్న అలజడికి మీరంతా లేచి బయటికి వచ్చారు. మీ నాన్నకు సమాధానం చెప్పకుండా నీ మీద నిలిపిన నా చూపుల్లోని భావాన్ని మీ నాన్న తొందరగానే గ్రహించాడు. ఆయన కళ్లల్లో నిప్పుల కొండలేవో బద్దలయ్యాయి. చూపుల్లో రాశిగా పోసిన అసహ్యం పెల్లుబికింది.

కులం కంచెను దాటి, అంతస్తుల స్థాయిని మరచిన నా అంతు చూడాలనే క్రౌర్యం మనిషిని నిలువెల్లా కుదిపేయ సాగింది. అంతేగా మరి.. అల్లారుముద్దుగా, అతి జాగ్రత్తగా ఇంట్లో పెంచుకుంటున్న విలువైన వస్తువును దొంగిలించడానికి అర్ధరాత్రి ఎవడో ముక్కూ మొహం తెలియని వాడొస్తే కోపం రాకుండా ఎలా ఉంటుంది?

నా మీద మూకుమ్మడి దాడి మొదలైంది. నా శరీరం గాయాల సముదాయంగా మారిపోయింది.

ఒంటిమీద నూలుపోగు లేదు.

కుంకుమ కలిపిన నీళ్లను దేహంపై చల్లినట్లుగా నా శరీరమంతా రక్తంతో ప్రవహించసాగింది.

ముళ్లమీదో, రాళ్లమీదో ఈడ్చుతున్నట్లు, కర్రల్తో కసిదీరా కొడుతున్నట్లు, ఏవో ఆయుధాలతో మొహాన్ని ఛిద్రం చేస్తున్నట్లు, గుండెల్ని గునపాలతో పొడుస్తున్నట్లుగా, నా మెడమీద కాలితో బలంగా తొక్కుతున్నట్లుగా, తాడు నా మెడకు చుట్టి నన్ను అమాంతం పైకి లాగుతున్నట్లుగా నా ప్రాణం విలవిలలాడ సాగింది.

ఇప్పుడో కాసేపట్లోనో నా ఊపిరి ఆగిపోతుంది. ఈ లోకానికి, నాకు బంధం శాశ్వతంగా తెగిపోతుంది. పని తప్ప వేరే ప్రపంచం తెలియకుండా పెరిగిన నాలో రేగిన అలజడి నాతో పాటే చల్లారిపోతుంది. ఏ మట్టిపెళ్లల కిందో దుర్భరంగా నిద్రపోతుంది. నా దారిలో వేరొకరు నడవకుండా ప్రపంచానికి మంచి గుణపాఠం నేర్పుతుంది.

తొమ్మిది నెలలు అమ్మ కడుపులో పోసుకున్న ఊపిరి ఉరికొయ్యకు వేలాడుతోంది. కోడిపిల్లను గద్ద తన్నుకుపోయి నట్లుగా కాసేపట్లో మరణం నన్ను ఈడ్చుకుపోతుంది. దిసమొలతో పుట్టిన నేను ఇప్పుడు కూడా ఒంటిపై బట్టల్లేకుండానే వేలాడుతున్నాను.

ఇంతకీ నేనేం చేశాను?

ఇంతటి భయంకర మరణ వేదనలోనూ ఈ ప్రశ్న నన్ను వేధించసాగింది. ఏమో! కొన్ని ప్రశ్నలకు సమాధానాలు ఎంతకీ అంతుబట్టవు. కానీ, ఇంత అసహ్యంతోనూ, భయంకరంగానూ చంపుతున్నారంటే నేనేదో పెద్ద తప్పే చేసుంటాను. నా మూలాల్ని మర్చిపోయి వాళ్ల పునాదుల్ని కదిలించే దారుణ పాపానికి ఒడిగట్టే ఉంటాను. వాళ్ల భవంతికి పునాదులేసిన విషయం మర్చిపోయి వాళ్లతో పాటు ఆ భవంతిలోనే ఉండాలని ఆశపడి ఉంటాను.

5

నిన్ను చూశాను.. నీ వెనుక సుశిక్షితులైన సైన్యం కాపలా కాస్తుందని అనుకోలేకపోయాను.

నిన్ను ఇష్టపడ్డాను.. నీ చుట్టూ గీసిన రక్షణ వలయాన్ని ఛేదించాలని ఆరాటపడ్డాను.

నిన్ను ప్రేమించాను.. కులం కంచెను దాటి నా చావును నేనే కొనితెచ్చుకుంటున్నానని తెలుసుకోలేకపోయాను!

ఇదిగో ఇక్కడే.. నిన్ను మొదటిసారి చూసిన పున్నాగ పూలచెట్టు కొమ్మకే చాలాసేపటి నుంచీ నా దేహం వేలాడుతోంది. బిగించిన ఉరితాడు నుంచి నా ఊపిరి కొట్టుమిట్టాడుతోంది. ఏ మూలలోనో మిగిలి వున్న రక్తం బొట్లుబొట్లుగా నేలకు రాలుతోంది. నా తలమీద రాలుతున్న పున్నాగ పూలన్నీ నా రక్తంలో తడిసి నేలకు జారుతున్నాయి.

కాసేపట్లో మా అమ్మ వస్తుంది. ఎముకల గూడులా ఉన్న శరీరాన్ని బాదుకుంటూ, గుండెల మీద కొట్టుకుంటూ దుఃఖపు పొగతో దిక్కుల్ని నింపేస్తుంది. ఆసరా అర్థాంతరంగా కన్నుమూసిందనీ, మెడతాడుతో పాటు బొడ్డుతాడు కూడా తెగిపోయిందని పొగిలి పొగిలి కుములుతుంది.

పల్లెపల్లెంతా నీళ్ళు నిండిన కళ్లతోనూ, వంచిన తలతోనూ చెట్టు చుట్టూ చేరతారు. 'మన తలరాతలు ఇంతే' అని దీర్ఘంగా నిట్టూర్చుతారు. 'దొడ్లో పనిచేసేవాడు బిడ్డ వేపు చూత్తే ఆల్లూరుకుంటారా' అని 'లా' పాయింట్లు లాగుతారు. 'ఎంత పేమిత్తే మాత్రం కొట్టి సంపేత్తారా' అని సానుభూతి ప్రకటిస్తారు. 'కళ్లు నెత్తికెక్కి కులాన్ని మర్సిపోతే పేనాలు పోకుండా ఎట్టా వుంటాయి' అని గొణుక్కుంటారు.

వేలాడుతున్న నన్ను కిందకి దించుతారు. దిసమొలతో ఉన్న నా దేహాన్ని కప్పడానికి ప్రయత్నం చేస్తారు. పుట్టేటప్పుడు ఏం తెస్తామో తెలియదు. పోయేటప్పుడు ఎలా పోతామో తెలియదు. మధ్యలో సంపాదించుకున్న 'మహా సామ్రాజ్యా'ల కోసం ఒకర్నొకరం చంపుకుంటాం. ఈ మాత్రం నగ్న దేహాల్ని కప్పుకోవడానికి ఎన్నో జీవితాల్ని నాశనం చేస్తాం, మరెన్నో దారుణాలకు పథకాలు వేస్తుంటాం. ఎక్కువ, తక్కువనే భ్రమల్లో బతుకుతుంటాం.

పున్నాగ పూలచెట్టు నా వైపు విషాదంగా చూస్తుంది. బరువెక్కిన గుండెతో నా మీద కొన్ని పూలను రాల్చుతుంది. నేటికి నేను విగతజీవిని, రేపటికి గతాన్ని, భవిష్యత్తులో జ్ఞాపకాల్లో మాత్రమే మిగిలే భూతాన్ని!

తరాలు కూచుని తిన్నా తరగని సంపదలతో కొన్ని జాతులు బతుకుతుంటే, తరతరాలుగా చచ్చినవారిని గుర్తు చేసుకుంటూ మరో జాతి బతుకీడ్చడం దౌర్భాగ్యమే! ఉంచుకోవడానికి పనికొచ్చే కులం సంబంధాలు కలుపుకోడానికి

పనికిరాదు. అణగదొక్కడానికి పనికొచ్చే కులం ఆప్యాయంగా ఆలింగనం చేసుకోవడానికి పనికిరాదు. ఓట్లకోసం వాటేసుకున్నప్పుడు గుర్తొచ్చిన కులం గద్దెనెక్కాక పనికిరాదు.

నా కళ్ళు మూతబడుతున్నాయి.

నా కాళ్లు తేలిపోతున్నాయి.

'ఈ దేశంలో కులం కంటే మలమే గొప్పది, మలాన్ని విసర్జించగలుగుతున్నాం' ఎక్కడో విన్న మాటలు గుర్తొచ్చాయి.

★★★

COMMENTS